www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 02 | అక్టోబర్ | 2026
పేజీలు : 8

## విద్యార్థుల భద్రత, ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వద్దు




-వార్డెన్లు హాస్టల్‌లో ఉండాలి
-రెసిడెన్షియల్ పాఠశాల నిర్వహణపై సమీక్షించిన కలెక్టర్

3లో..

# ఎన్నికల సంఘం కుట్రతోనే బిజెపి గెలుపు







-జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే..
-నిర్వీర్యమవుతున్న రాజ్యాంగ వ్యవస్థలు
-సిపిఐ నేత బాగం
-కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆందోళన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎన్నికల సంఘం కుట్రలు, కుతంత్రాల కారణంగానే 2024లో బిజెపి అధికారంలోకి వచ్చిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. భారత ఎన్నికల సంఘం బిజెపి అనుబంధ సంస్థగా మారిందని ఆయన తెలిపారు. ఎన్నికల ప్రధానా ధికారి జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ

మిగతా 2లో..

# కొనుగోళ్లలో 'ట్రక్' టమారం



- మిల్లర్ల కొర్రీలు, ధాన్యంలో కోతలు
- రైస్ మిల్లుల యజమానులతో అధికారుల మిలాఖత్ ?
- ఆరుగాలం కష్టంపై అడ్డగోలు పెత్తనం
- జిల్లాలో ప్రతీ సీజన్‌కు సుమారు రూ.15 కోట్ల దోపిడీ

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆరుగాలం కష్టపడి పండించిన అన్నదాత అడుగడుగునా దోపిడీకి గరువుతున్నాడు. ప్రతీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి మిల్లర్లు కొర్రీలు పెట్టి ఇష్టాను సారంగా కోతలు విధించడం పరిపాటిగా మారింది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఐకేపి,జిసిసి,సొసైటీ సెంటర్ల వారు ట్రక్ షీట్లను మాన్యువల్‌గా రాసి ఇవ్వడం, మిల్లుకు ధాన్యం బస్తాలు చేరిన తర్వాత తాలు తేమ మట్టి పేరుతో మిల్లర్లు కోతలు పెట్టడం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ మ్యాన్యువల్ షీట్‌లో రాసిన మొత్తం ధాన్యంలో మిల్లర్లు పెట్టిన కోతలు తరుగులకు చెందిన డబ్బులను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఏకంగా మళ్లీ రైతుల వద్ద నుండే వసూళ్లు చేస్తున్నట్లు వినికిడి. ఇదిలా ఉండగా కొన్ని సందర్భాల్లో మిల్లర్లు చెప్పిన ధాన్యపు బస్తాలను మాత్రమే ఆన్‌లైన్ ట్రక్‌షీట్‌లో

మిగతా 2లో..

# విలువైన ఖనిజం లూటీ



-అక్రమ మైనింగ్‌పై చర్యలేవి....?
-సిపిఐ నేత బాగం
-అక్రమ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించిన సిపిఐ బృందం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** జిల్లాలో విలువైన బెరైటీస్ ఖనిజాన్ని కొందరు అక్రమార్కులు అక్రమంగా తరలిస్తున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. ఎటువంటి అనుమతులు లేకుండానే తవ్వకాలు జరుపుతుంటే మైనింగ్ అధికారులు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని వెలుగుమట్ల అర్బన్ పార్కు ప్రాంతంలో అక్రమ మైనింగ్ చేస్తున్న ప్రాంతాలను గురువారం సిపిఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ ఖనిజ తవ్వకాలకు సంబంధించి ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని, ఖనిజ తరలింపుకు ప్రభుత్వానికి పన్ను చెల్లించాలని ఇవేవి లేకుండానే ఖనిజాన్ని తరలించి సొమ్ము చేసుకుంటున్నారని హేమంతరావు తెలిపారు. గతంలో కూడా

మిగతా 2లో..

# రూ.200 కోట్లతో విద్యుత్ సమస్యలకు పరిష్కారం



- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- 30వ వార్డులో టీజీఎన్, పీడీసీఎల్ డివిజన్ కార్యాలయం, విద్యుత్ రెవెన్యూ కార్యాలయం భవనం ప్రారంభం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఫ్రీ కరెంట్‌కు పేటెంట్‌హకైన కాంగ్రెస్ పార్టీ అదే ఒరవడిని కొనసాగిస్తూ పాలేరుని యోజకవర్గంలో గృహజ్యోతి పథకం ద్వారా రూ.40.19 కోట్ల సబ్సిడీని లబ్ధిదారులకు వర్తింప చేసినట్టు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏదులాపురంమున్సిపాలిటీ 30వ వార్డులోని తరుణిహట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన టిజిఎన్‌పిడిసిఎల్ డివిజన్, విద్యుత్తు రెవెన్యూ కార్యాలయ భవనాలను కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్‌దత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా కొరకు 33కేవీ ఇంటర్ లింకింగ్ లైన్

మిగతా 2లో..

# ఏఐకెఎంఎస్ మహాసభలు విజయవంతం



**-17 తీర్మానాలు ఆమోదం**

**-అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నిర్భయ్ సింగ్, చలపతిరావు**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ (ఏఐకెఎంఎస్) నాల్గవ జాతీయ మహాసభలు ఖమ్మంలో విజయవంతంగా ముగిసినట్లు ఏఐకెఎంఎస్ నాయకులు తెలిపారు. గురువారం ఖమ్మం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఫాసిస్టు దాడులు, కార్పొరేట్ దోపిడీ, భూస్వామ్య అణిచివేతకు వ్యతిరేకంగా రాజీలేని ప్రజా ఉద్యమాలను నిర్మించాలని మహాసభ పిలుపుని చ్చిందన్నారు. మహాసభలో నూతన జాతీయ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. జాతీయ అధ్యక్షులుగా నిర్భయ్ సింగ్ దుడికే, ప్రధాన కార్యదర్శిగా జెవి చలపతిరావు, ఉపాధ్యక్షులుగా అశీష్ మిట్టల్, సుధాకర్, కార్యదర్శులుగా బాలచంద్ర, రవీంధర్ సింగ్, కోశాధికారిగా పి. వెంకటేశ్వర్లు తో పాటు మరో 15 మందితో కేంద్ర కార్యనిర్వాహక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు, వ్యవసాయ కార్మికుల ఐక్య పోరాటాలకు ప్రతీకగా ఆకుపచ్చ పట్టి, ఎరుపురంగు నేపథ్యంలో నాగలి, కొడవలి చిహ్నాలతో కూడిన నూతన జెండాను మహా సభ ఆమోదించిందన్నారు. ఈ మహాసభల సందర్భంగా వ్యవసాయ రంగం నుంచి కార్పొరేట్ సంస్థలను పూర్తిగా నిషేధించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు కనీస మద్ధతు ధర చట్టబద్ధం చేయాలని, రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలన్ని మాఫీ చేయాలని మహాసభ తీర్మానించిందన్నారు. అదేవిధంగా పెద్ద ఆనకట్టలు, కెన్ బెట్వా లింక్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ, ఉపా, ఎన్ఎస్ఏ వంటి నల్ల చట్టాలను రద్దు చేయాలని, భూ గరిష్ట పరిమితిని తగ్గించి పేదలకు భూ పంపిణీ చేపట్టాలని, సిఈసి జ్ఞానేష్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని తదితర మొత్తం 17 తీర్మానాలను ఆమోదించినట్లు వారు తెలిపారు. మహాసభల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ అధ్యక్షులు నిర్భయ్ సింగ్ దుడికే, జాతీయ ప్రధాన కార్యదర్శి జెవి చలపతిరావు, ఉపాధ్యక్షులు అశీష్ మిట్టల్, సుధాకర్, జాతీయ కార్యదర్శి రవీంధర్ సింగ్ పాటియాల, జాతీయ కార్యవర్గ సభ్యులు వెంకట్రామయ్య, గౌని ఐలయ్య పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రత, ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వద్దు

**-వార్డెన్లు హాస్టల్‌లో ఉండాలి**

**-రెసిడెన్షియల్ పాఠశాల నిర్వహణపై సమీక్షించిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థుల భద్రత, ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి కలెక్టర్ దివాకర టిఏస్ గురుకుల పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లలో వార్డెన్లు స్థానికంగా అందుబాటులో ఉంటే 90 శాతం సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. వచ్చే వారం నుంచి రాత్రి, తెల్లవారు జాము సమయాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడతామని, విధుల్లో లేని వార్డెన్లను తక్షణమే సస్పెండ్ చేస్తామని తెలిపారు. విద్యార్థులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పారిశుధ్య పనులు చేయించవద్దని అలా చేయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. హాస్టళ్లలలో నాణ్యమైన ముడిసరుకులను వినియోగించి ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పాము, ఎలుక కాట్లు జరగకుండా స్థానిక సంస్థల సమన్వయంతో నెలకు ఒకసారి పరిసరాల్లోని పిచ్చి మొక్కలను, పొదలను తొలగించి ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. కాంపౌండ్ వాల్ లేని హాస్టళ్ల వివరాలను సంబంధిత శాఖాధిపతులకు తెలియజేయాలని సూచించారు. శాఖల నుంచి ప్రతిపాదనలు సమర్పిస్తే ఉపాధి హామీ పనుల క్రింద కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ షాక్‌కు గురయ్యే పరిస్థితులు ఉన్న భవనాల వివరాలను




వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. విద్యార్థులకు శారీరక, మానసిక ఆరోగ్యం పై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, లైంగిక వేధింపుల ఘటనలపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తూ అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులతో అధికారులు, వార్డెన్లు క్రమం తప్పకుండా మాట్లాడాలని వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. హాస్టళ్లలో స్పష్టమైన విజిలెన్స్ వ్యవస్థ ఉండాలని తెలిపారు. డైట్, కాస్మోటిక్, సిబ్బంది వేతనాల పెండింగ్ వివరాలు సమర్పిస్తే నిధుల విడుదలకు ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామన్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ మంజూరైన మరుగుదొడ్లు, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారులు జి. జ్యోతి, ముజాహీద్, ఫిరంగి, ఆర్‌సివోలు, హాస్టల్ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నప్రసాద వితరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగి సహాయకులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని నిత్య అన్నప్రసాద సేవా కేంద్రంలో గురువారం ఖమ్మం నగరానికి చెందిన చెందోలు నవ్య తన కుమారుడు హేమాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా తాత వివి కృష్ణారావు ఆధ్వర్యంలో, వాసిరెడ్డి కుసుమ నెలవారి తిథి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు వాసిరెడ్డి సేవా సమితి తరుపున రోగి సహాయకులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వీరభద్రం, సుబ్బారావు, రామసీత, శ్రీదేవి, అర్జున్‌రావు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

## మెకానిక్ కుటుంబానికి బీమా చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మెకానిక్ కుటుంబానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరుపున బీమా చెక్కును గురువారం అందజేశారు. ఖమ్మం కార్పోరేషన్ టూ వీలర్ మెకానిక్ యూనియన్‌కు చెందిన దేవరకొండ నాగాచారి 20 సంవత్సరాలుగా మెకానిక్ వృత్తిలో ఉంటూ ఈ ఏడాది మేలో ప్రమాదవ శాత్తు మృతిచెందాడు. మృతునికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నందు ఇన్సూరెన్స్ చేయించడంతో నామిని అయిన నాగాచారి భార్య దేవరకొండ శిరీష యూనియన్ బ్యాంకు నుండి నాలుగు లక్షల రూపాయల చెక్కును బ్యాంకు రీజినల్ హెడ్ కె. వెంకట్రావు, డిప్యూటీ రీజినల్ హెడ్ ఎం. సుధాకర్‌రావు, ఓల్డ్ కలెక్టరేట్ బ్రాంచ్ మేనేజర్ ఆర్. వీర వసంతరావు, రవితేజ చేతుల మీదుగా యూనియన్ సమక్షంలో అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు వంగాల కొండలరావు మాట్లాడుతూ ప్రమాదం అనేది చెప్పి రాదని ప్రతి ఒక్కరూ ప్రమాద బీమాను తీసుకోవాలని సూచించారు. యూనియన్‌లో సభ్యత్వం తీసుకున్న మెకానిక్‌లకు యూనియన్ అండగా ఉంటూ సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు నున్నా అప్పారావు, ప్రధాన కార్యదర్శి లింగనబోయిన మురళీ, కోశాధికారి బండి నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శి బైరోజు శేషు, ఆవుల నర్సింహారావు, మధు, భద్రం, పరశురాం, నరేష్, విజ్ఞాన్ పాల్గొన్నారు.

# సామాన్యుడికి వజ్రాయుధం సమాచార హక్కు చట్టం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సమాచార హక్కు చట్టం సామాన్యుడికి వజ్రాయుధం లాంటిదని తెలంగాణ సమాచార హక్కు చట్టం కమిషనర్ పివి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా॥ మహ్మద్ జాకీరుల్లా అధ్యక్షతన జరిగిన సమాచార హక్కు చట్టం స్వరూప స్వభావాలు అనే అంశంపై జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాలు, చరిత్ర, గతం, వర్తమానం, భవిష్యత్తు గురించి విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. కళాచరిత్రను ఈనాటి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. శ్రీశ్రీ లాంటి కవులు సందర్శించిన కళాశాలల్లో చదువుతున్నామని సగర్వంగా నిలవాలని కోరారు. జవాబుదారి తనం ఉండాలనే ఆలోచనతో ఈ చట్టం వచ్చిందని పౌర సమాజానికి పారదర్శకత ఉండాలనే ఆకాంక్షతో ఆర్టిఐ 2025లో సమాచార హక్కు చట్టాన్ని రూపొందించారని, విద్యార్థులు సామాజిక అవగాహనతో పాటు పౌర బాధ్యతలను గుర్తెరిగి వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎఎల్ఎన్ శాస్త్రి, ఎగ్జామ్స్ కంట్రోలర్ డా॥ రమా సత్యవతి, పూర్వ విద్యార్థి వంజాకుల లక్ష్మి నారాయణ, గెంటేల నారాయణరావు మనవడు శ్రీనివాసరావు, అధ్యాపకులు బంగారా, డా॥ వై. రవి వర్ధన్, డా॥ లక్ష్మణ్‌రావు, పి. నర్సింహారావు, అజిత్, అప్పారావు, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## సత్తుపల్లి ఏరియాలో సింగరేణి డైరెక్టర్ విస్తృత పర్యటన



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి బొగ్గు ఉత్పత్తి పెంపుదల, నాణ్యతా ప్రమాణాలు, భవిష్యత్ ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించే లక్ష్యంతో సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కే. వెంకటేశ్వర్లు గురువారం సత్తుపల్లి ఏరియాలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం ఎస్. వెంకటచారితో కలిసి జేవిఆర్ ఓసి 2 గనిని తనిఖీ చేశారు. అనంతరం ప్రతిపాదిత జేవిఆర్ ఓసి3 ప్రాజెక్టు స్థలం, గనుల విస్తరణ ప్రాంతాలను పరిశీలించారు. బొగ్గు రవాణా, విజయవాడ రోడ్ డైవర్షన్, ప్రాజెక్టు సరిహద్దులు, విస్తరణకు ఉన్న భౌగోళిక, సాంకేతిక అనుకూలతలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జీఎం కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమై ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు.

## బాధ్యతలు చేపట్టిన సిఐలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖమ్మం టూటౌన్, అర్బన్, ట్రాఫిక్ సిఐలుగా జె.రామకృష్ణ, ఎం నాగరాజు, కె శివప్రసాద్‌లు గురువారం వారి వారి స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్‌కమిషనర్ సునిల్‌దత్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిచి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిపి వారికి పలుసూచనలు చేశారు. ఇచ్చిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు విచారించి పరిష్కరించాలని ఆదేశించారు.

## రుద్రాక్షపల్లిలో అభివృద్ధి పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిదిలోని రుద్రాక్షపల్లి గ్రామంలో గురువారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. రుద్రాక్షపల్లి, కొమ్ముగూడెం, బాసారం, తోగ్గూడెం, రంగాపురం, సత్యంపేట గ్రామాల్లో నిర్మించిన 28 సీసీ రోడ్లను ప్రారంభించడంతో పాటు, పంచాయతీ పరిధిలోని ప్రజలకు సుమారు 1,200 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. రుద్రాక్షపల్లి పంచాయతీలో ఇప్పటివరకు సుమారు రూ.4 కోట్లతో సత్తెమ్మ గుడి రోడ్డు, మూడు స్త్రీ శక్తి భవనాలు, ఆర్వో వాటర్ ప్లాంట్, సోలార్ మోటార్లు, సోలార్ లైట్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడతలో 42 ఇళ్ల మంజూరు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు. గ్రామంలో 10 సీసీ కెమెరాలు, టీవీని ప్రారంభించారు. వైకుంఠధామంలో అంత్యక్రియల కోసం ఉచితంగా కట్టెలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, ఎంపీడీవో, గ్రామ సర్పంచ్ పాయం నాగేంద్రబాబు, ఉపసర్పంచ్ భూపతిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పవర్ గ్రిడ్ స్టేషన్ ఇంచార్జి, డిజిఎం అంకం పవన్‌కుమార్ తెలిపారు. గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బూడిదంపాడులోని పవర్ గ్రిడ్ ఖమ్మం సబ్ స్టేషన్ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పవర్ గ్రిడ్ ఉద్యోగులు, ఏఎంసి సిబ్బంది, భద్రతా సిబ్బంది, ఇతర సహాయక సిబ్బంది పాల్గొని పవర్ గ్రిడ్ స్టేషన్ ఆవరణతో పాటు బూడిదంపాడు, బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రం చేశారు. పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పవర్ గ్రిడ్ ఇంచార్జి పవన్‌కుమార్ మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు.

# ప్రియుడే హంతకుడు



**ప్రేమను నిరాకరించడంతో మెడకు గేర్ వైర్ బిగించి దారుణ హత్య**
**ద్విచక్ర వాహనం కోసం వచ్చి దొరికిన నిందితుడు**
**హరిణి హత్య కేసు విచారణలో తేల్చిన పోలీసులు**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** గత తొమ్మిది రోజులు క్రితం నర్సింగ్ విద్యార్థిని హత్య కేసు ఎంతటి సంచలనంగా మారిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. విద్యార్థిని ఇంటి ఆవరణంలో బాత్ రూమ్ వెనకాల హరిణి అత్యంత పాశవికంగా హత్యకు గురైంది. సెలవులకు ఇంటికి వొచ్చిన నర్సింగ్ విద్యార్థిని శవంగా బాత్ రూమ్ పక్కన పోలీసులకు కనిపించింది. ఈ కేసును సీరియస్ గా తీసుకున్న జూలూరుపాడు పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. తొమ్మిది రోజులు గాలించి ప్రియుడు పవన్ ని అరెస్ట్ చేసి విచారించగా నమ్మలేని నిజాలు వెలుగు చూశాయి. తానే తన ప్రియురాలిని హత్య చేసినట్లు పవన్ ఒప్పుకోవడం ఇంకా సంచలనంగా మారింది. ఈ ఘటన కు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జూలూరుపాడు మండలపరిధిలోని వెంగన్న పాలెం గ్రామానికి చెందిన ఇంద్రపల్లి హరిణి హత్యకు గురైన హత్య కేసు మిస్టరీ వీడింది. ఆమె ప్రియుడు దేవరకొండ పవన్ కుమార్ హరిణిని హత్య చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది.

### డిఎస్పీ ఆదినారాయణ వివరణ..!

జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఇంద్రపల్లి హరిణి హత్య కేసులో పరారీలో ఉన్న నిందితుడు దేవరకొండ పవన్ కుమార్‌ను జూలూరుపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. 22.09.2026న మధ్యాహ్నం సుమారు 3 గంటల నుంచి 5 గంటల మధ్యలో వెంగన్నపాలెం గ్రామంలోని తన ఇంటి వద్ద ఇంద్రపల్లి హరిణి



(18) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు మృతురాలి తల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొలుత. క్రైం నెం.155/2026 యూ/ఎస్ 194 బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించగా, మెడకు వైర్ వంటి వస్తువుతో బిగించి హత్య చేసినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. దీంతో కేసును యూ/ఎస్ 103(1) బీఎన్ఎస్ కింద హత్య కేసుగా మార్చారు. దర్యాప్తులో మృతురాలు హరిణి, నిందితుడు దేవరకొండ పవన్ కుమార్ (22), గత నాలుగు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నట్లు, వివాహం చేసుకోవాలని భావించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అయితే ఇరువురి కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదాల నేపథ్యంలో హరిణి పవన్ కుమార్‌ను వివాహం చేసుకోవడానికి నిరాకరించినట్లు, ఈ కారణంతోనే నిందితుడు హరిణిని హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. హత్య అనంతరం నిందితుడు పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో నిందితుడు ఒంటిగుడిసె రోడ్‌లోని సీతారామ ప్రాజెక్టు కాలువ సమీపంలో దాచిపెట్టిన టీఎస్28జి9583 నంబర్ గల గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని తీసుకుని దూర ప్రాంతానికి వెళ్లి ర్యాపిడోలో పని చేసుకుంటూ జీవించేందుకు ప్రయత్నిస్తున్నాడన్న నమ్మదగిన సమాచారం పోలీసులకు అందింది. సమాచారం మేరకు జూలూరుపాడు సీఐ, ఎస్ఐ, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి నిందితుడు దేవరకొండ పవన్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.

### నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు...

టిఎస్28జి9583 నంబర్ గల గ్లామర్ బైక్, రెండు మొబైల్ ఫోన్లు, ఒకటి మృతురాలి ఫోన్, మరొకటి నిందితుడి ఫోన్, బైక్ గేర్ వైర్, నిందితుడు ధరించిన షర్ట్. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు.

# పౌష్టికాహారంతోనే తల్లి, శిశు ఆరోగ్యం

**-బంజర్ రైతువేదికలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ రైతువేదికలో పోషణ మాసం సందర్భంగా మండల స్థాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 20 మంది గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మోరంపల్లిబంజర్ సర్పంచ్ బొర్రా సుభద్ర గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. గర్భం దాల్చిన నాటి నుంచి శిశువు తొలి 1,000 రోజుల వరకు తల్లి, బిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని వివరించారు. అనంతరం సీడీపీవో మంగతారా మాట్లాడుతూ తల్లి, శిశు ఆరోగ్యం, పోషకాహారం, పిల్లల సమగ్ర ఎదుగుదలలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్రపై అవగాహన కల్పించారు. పోషణ మాసం సందర్భంగా పోషకాహార పదార్థాల పంపిణీ చేపట్టారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. విద్యతో పాటు పిల్లల ఆరోగ్యం, పోషకాహారంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్వాహకులు సూచించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ పొక్కుల రవి, వైద్యాధికారి, ఏసీడీపీవోలు సౌమ్య, సంగీత, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, పోషణ అభియాన్ సిబ్బంది, గర్భిణులు, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీతకు అభినందనలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న అధ్యాపకుడు తమ్మిశెట్టి శ్రీనివాస్‌కు కారేపల్లి కళాశాలలో ప్రిన్సిపాల్ విజయకుమారి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని ఆయనను అభినందించారు. ఈకార్యక్రమంలో టీజీవో జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి, అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లెల రవీందర్, శాంతినగర్ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు, చర్ల ప్రిన్సిపాల్ నరేందర్, టిగ్లా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీపీ గణేష్, ప్రిన్సిపాల్ పవన్, జిల్లా హౌసింగ్ బోర్డు అధ్యక్షుడు శేష ప్రసాద్ పాల్గొని శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీకి మరమ్మతులు

**-ఎనిమిది నెలల సమస్యపై అధికారుల చర్యలు**




**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ సమీపంలో ఎనిమిది నెలలుగా కొనసాగుతున్న మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీపై "ప్రజాపక్షం"లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం యంత్రాలతో తవ్వకాలు చేపట్టి లీకేజీకి కారణమైన పైపులైన్‌ను గుర్తించి మరమ్మతులు ప్రారంభించారు. పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా కావడంతో పాటు రహదారి పక్కన బురద, గుంతలు ఏర్పడి దుకాణదారులు, వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పనులు ప్రారంభం కావడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చిన "ప్రజాపక్షం"కు, స్పందించి మరమ్మతులు చేపట్టిన మిషన్ భగీరథ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థుల మంచినీటి సమస్యకు పరిష్కారం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** స్థానిక జెడ్‌పి పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు పరిష్కారం కల్పించారు. సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి ఆధ్వర్యంలో గురువారం మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసి నల్లా కనెక్షన్ ఏర్పాటు చేశారు. పంచాయితీ పరిధిలో తాగునీటి సమస్యలను అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లగా రూ 5లక్షలు ఎంఎల్‌ఏ నిధులు మంజూరయ్యాయని సర్పంచ్ తెలిపారు. ఈ నిధులతో అవసరమైన ప్రాంతాల్లో నీటి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. పంచాయితీ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారంలో భాగంగా ఇప్పటికే 120 స్తంభాలు ఏర్పాటు చేశామని, మరో 30 అవసరమున్నాయని తెలిపారు. కోతుల బెడద నివారణకు గ్రామస్తులు, పార్టీ నాయకులు, వార్డు సభ్యులతో తీర్మానం చేసి నిధులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ అంతటి రామకృష్ణ, వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు కొత్తపల్లి విద్యార్థులు




**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో గత నెల 30న నిర్వహించిన పాఠశాలల జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 14 హాకీ ఎంపికల్లో పీఎం శ్రీ ఆశ్రమ ఉన్నత పాఠశాల, కొత్తపల్లికి చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జె జస్వంత్ 9వ తరగతి, ఎం జీవన్ బాబు, ఎం యాకూబ్, యు గోపీచంద్‌లు 8వ తరగతి ప్రభ కనబరిచారు. విద్యార్థులను హెచ్‌ఎం పి నరసింహారావు, పీడీ హరికృష్ణ, పీఈటీ గంగరాజు, వార్డెన్ నాగేశ్వరరావు, స్టాఫ్ సెక్రెటరీ శివ ప్రసాద్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

## గురుకుల పాఠశాలలో జోనల్ అధికారి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి శ్రీకవిత ఇంజనీరింగ్ కళాశాల భవనంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను భద్రాద్రి జోన్ జోనల్ అధికారి పి అపర్ణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి విద్య, వసతి, భోజనం, ఆరోగ్యం, మౌలిక వసతులపై వివరాలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నట్లు విద్యార్థినులు తెలిపారు. అనంతరం ఎస్ఏ 1 పరీక్షల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డైనింగ్ హాల్, వంటశాలను తనిఖీ చేసి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్యాంపస్‌లో పెరిగిన గడ్డిని తొలగించి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, విద్యార్థినులకు సురక్షిత, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యార్థులు తమ దైనందిన జీవితంలో పరిశుభ్రతను భాగంగా చేసుకోవాలని ఎంపిడిఓ పి. రాజారావు అన్నారు. మండల పరిధి లక్ష్మిదేవిపల్లి (యు)గ్రామంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏక్ తారీఖ్, ఏక్ గంట శ్రమదానం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు తడి, పొడి చెత్తను వేరువేరుగా గుర్తించి సరైన విధానంతో పాటు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలన్నారు. చదువుతోనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకొని ఉజ్వల భవిష్యత్‌ను అందుకోవచ్చని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయితీ కార్యదర్శి, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి



**ప్రజాపక్షం/గుండాల :** విద్యార్థులు మంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అలవరుచుకోవాలని సిఐ తిరుపతి, ఎస్సై శ్రావన్ కుమార్ పిలుపునిచ్చారు గురువారం ఏకలవ్య మోడల్ స్కూల్ నందు విద్యార్థులతో కూడి సమావేశం నిర్వహించి, పలు చెడువ్యసనాలపై అవగాహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో క్రమశిక్షణ,సోదరబావం,గురువులపట్ల గౌరవం కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు ఇతర విషయాల్లో కాకుండా విద్యపై దృష్టిని సారించి గొడవల్లో తలదూర్చవద్దని, సిగరెట్,గుట్కా,మద్యం, మాదక ద్రవ్యాలు వంటి జోలికి వెల్లవద్దని , అవి తమ బౌశత్‌ను నాషనం చేస్తాయని హెచ్చరించారు. ఉపాధ్యాయులు లోకల్ కట్టుబాట్లకు అనుగుణంగా నడుచుకోవాలని , లోకల్‌వారితో వారితో సన్నిహితంగా మెలగాలని సూచించారు.

# పేద కుటుంబాలకు అండగా ప్రజా ప్రభుత్వం

## స్మార్ట్ రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం



ప్రజాపక్షం/మణుగూరు: పేద కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర శాసనసభ షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మణుగూరు మండలంలోని 14 గ్రామ పంచాయతీలు మరియు మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను, అలాగే 33 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతోందని, పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అదే విధంగా ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం ద్వారా 33 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం వివాహ సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పినపాక నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా తన వంతు కృషి కొనసాగిస్తానని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ రామారావు, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, సివిల్ సప్లై అధికారి, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పనులు ప్రత్యేక బాధ్యతతో నిర్వహించాలి



ప్రజాపక్షం/భద్రాచలం : కోయ గోండి నిఘంటువు వర్క్‌షాపు నిర్వహణకు సంబంధించిన పనులు ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించి కార్యక్రమం విజయవంతం అయ్యేలా కృషి చేయాలని ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజు అన్నారు. గురువారం వర్క్‌షాపు జరిగే గిరిజన భవనం, ప్రతినిధుల వసతి కోసం ఏర్పాటు చేసిన సమ్మక్క సారక్క ఫంక్షన్ హాల్లో ఐటిడిఏ అధికారులు, కమిటీ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 2 నుండి 5వ తేది వరకు జరిగే గోండి కోయ భాష ప్రామాణీకరణ నిఘంటువు వర్క్‌షాపుకు రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు, ఇతర అధికారులతో పాటు మహారాష్ట్ర ఝార్ఖండ్ అస్సాం మధ్యప్రదేశ్ ఒడిస్సా ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలతో కలిపి 120 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారని చెప్పారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఐదురోజులపాటు జరిగే కార్యక్రమంలో భాగంగా ప్రముఖులతో పాటు ప్రతినిధులకు భోజన ఏర్పాట్లు వసతి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఇటిసి ప్రిన్సిపల్ డా. వీరునాయక్, రిటైర్డ్ ఏపిఎంఓ రమణయ్య, మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదు గ్రామపంచాయితీలను తెలంగాణలో కలపాలి



ప్రజాపక్షం/భద్రాచలం : పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజాభీష్టం మేరకు ఐదు గ్రామ పంచాయితీలను తెలంగాణలో విలీనం చేయాలని సిపిఐ ఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ముంపు మండలాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆ పార్టీ పోలవరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మోటార్ సైకిల్ యాత్ర గురువారం భద్రాచలం చేరుకోవడంతో స్థానిక రాజుపేట వద్ద ఘనం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఏ కుంజాబొజ్జి స్మారక స్థూపానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా గద్దం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పోలవరం ముంపు ప్రాంతాల ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు కూడా తీవ్ర వివక్ష చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కన్నాయిగూడెం నుండి భద్రాచలం వరకు ఉన్న రహదారి చూస్తే కూటమి పాలనలో పరిస్థితి అర్థమవుతోందన్నారు. సరిహద్దు గ్రామాల మౌళిక సదుపాయాలు రహదార్ల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఎటపాక భద్రాచలం సరిహద్దులో ఉన్న కరకట్ట స్లూయిస్ మరమ్మత్తుల విషయంలో రెండు ప్రభుత్వాలు ఎవరికి వారు పట్టనట్లు వ్యవహరిస్తూ ప్రజలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం బ్యాక్ వాటర్ నుండి భద్రాచలాన్ని రక్షించేందుకు కరకట్టలు పటిష్టం చేయాలని, రామాలయానికి ముంపు తప్పదని నీటిపారుదల శాఖ నిపుణులు చెబుతున్నప్పటికే కేంద్రం స్పందించక పోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకులు కృషి చేయాలని కోరారు.

# ఇసుక అక్రమ ఆన్‌లైన్ నిలిపివేయాలి

## తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు అలెం కోటి డిమాండ్



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండల కేంద్రంలో జరుగుతున్న ఇసుక అక్రమాలను అరికట్టేందుకు ఇసుక ఆన్‌లైన్ ప్రక్రియను నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు అలెం కోటి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అలెం కోటి మాట్లాడుతూ పద్మ గూడెం, బాపనకుంట, శివాజీనగర్ తదితర గ్రామాల పరిధిలో ఇసుక సొసైటీలు ఏర్పాటు చేసి, మైదాన ప్రాంత వాసులు, ఆంధ్ర ప్రాంత గిరిజనేతరులు (భీమవరం) భారీగా అక్రమ ఇసుక దందా రాజేష్ నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ సహజ వనరులను దోచుకుపోతున్నారని ఆరోపించారు. 1/70 చట్టం, అసైన్మెంట్ చట్టం, పీటీటీ చట్టంలోని నిబంధనలు, నాలా కన్వర్షన్ నిబంధనలు పాటించకుండా ఇసుక డంపింగ్ చేస్తూ, వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని ఆయన ఆరోపించారు. కోట్లాది రూపాయల విలువైన ఇసుకను అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వానికి భారీగా నష్టం కలిగిస్తున్నారని అన్నారు. ఈ అక్రమాల వెనుక అధికార పార్టీకి సంబంధించిన వ్యక్తులు, కొంతమంది ప్రభుత్వ అధికారులు ఉన్నారని అలెం కోటి ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేయాలని, ఆదివాసీల సహజ వనరులను కాపాడాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ డిమాండ్ చేస్తుందని తెలిపారు. ఇసుక అక్రమాలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోకపోతే రేపటి నుంచి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని అలెం కోటి హెచ్చరించారు.

# ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం

## మానవత్వం చాటుకున్న కరకగూడెం ఎస్సై



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మలకుర్తి బాలకృష్ణ (బాలు) ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయన మృతితో ఆ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. ఈ నేపథ్యంలో బాలు దిశదిన కర్మల (దినవారాల) ఖర్చుల నిమిత్తం పలువురు మానవత్వాన్ని చాటుకున్నారు. కరకగూడెం ఆటో యూనియన్ సభ్యులు బాధిత కుటుంబానికి రూ. 5,000/ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే స్థానిక ఎస్సై నాగేశ్వర రావు సైతం తన ఉదారతను చాటుకుంటూ బాలు కుటుంబ సభ్యులకు రూ. 5,000/ నగదును ఆర్థిక సహాయంగా అందజేసి, బాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కష్ట సమయంలో తమకు అండగా నిలిచిన ఆటో యూనియన్ సభ్యులకు, ఎస్సై నాగేశ్వర రావు కు బాలు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు కొమరం సాంబశివరావు, గుడ్ల రంజిత్ , సౌందర్యరావు, రాములు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



ప్రజాపక్షం/కారేపల్లి: గిరిజనుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. కారేపల్లి మండల మహాసభలో జిల్లా అధ్యక్షుడు బానోత్ బాలాజీనాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. గిరిజన తండాల్లో మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని, కారేపల్లిలో 50 పడకల ఆసుపత్రి, ఎకరం స్థలంలో సేవాలాల్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. పోడు రైతులకు హక్కు పత్రాలు, గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి అక్టోబర్ 10,11 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభకు అజ్మీరా శోభన్ నాయక్ అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో వజ్జా మారావు, కే నరేంద్ర, భూక్యా రంజిత్ నాయక్, బానోతు బన్సీలాల్, వాంకుడోత్ రాందాస్ నాయక్, మాలోత్ బాలునాయక్, బానోతు శ్రీనివాస్, భూక్యా రమేష్, ధరావత్ వినోద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# చదువు కోసం సాయం



ప్రజాపక్షం/పాల్వంచ : అవకాశాలను అందిపుచ్చుకొని చదువులో రాణించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు అన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకూడదనే లక్ష్యంతో సిపిఐ పాల్వంచ పట్టణ కార్యదర్శి, 40వ, డివిజన్ కార్పోరేటర్ అడుసుమిల్లి సాయిబాబ సహకారంతో బిటెక్ నాలుగవ సంవత్సరం చదువుకొంటున్న రాంనగర్‌లోని నిరుపేద కుటుంబానికి చెందిన రహీం కుమార్తె షహనాజ్‌బాకు మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు చేతుల మీదుగా 10 వేయిల రూపాయల నగదును గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు శనగారపు శ్రీనివాసరావు, రహీం, అల్లి వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్, లాల్‌పాషా, బాను తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలలకు 59 మంది విద్యార్థులు ఎంపిక



ప్రజాపక్షం/భద్రాచలం : ఐటిడిఏ పరిధిలోని ఆశ్రమపాఠశాలల విద్యార్థులు క్రీడా రంగంలో సత్తాచాటారు. ఇటీవల కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభకనబరిచిన 59 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఐటిడిఏ పిఓ రాహుల్ విద్యార్థులను అభినందించారు. ఎంపికైన వారిలో రెజ్లింగ్‌లో 16 మంది, హాకీలో 33 మంది, టాంగ్‌టాలో 10 మంది ఉన్నారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా సామాగ్రిని అందించడంతో పాటు డిప్యూటీ డైరెక్టర్ చందన ప్రోత్సాహం పర్యవేక్షణ పిడిలు పిఇటిలు అందించిన శిక్షణతో విద్యార్థుల్లోని క్రీడాప్రతిభ వెలుగులోకి వచ్చిందని పిఓ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరచాలని పిఓ ఆకాంక్షించారు.

# 59 మంది రక్తదానం



ప్రజాపక్షం/భద్రాచలం : జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో సుక్మా జిల్లా ఇంజిరామ్‌లో 219 బెటాలియన్ సిఆర్‌పిఎఫ్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 59 మంది రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని డిజిపి రాజేష్ పాండే ప్రారంభించి రక్తదానం గొప్ప మానవతా సేవ అన్నారు. ప్రజలంతా స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డా. ఎల్‌వెస్ కాంతారావు వైస్ చైర్మన్ చల్లగుళ్ల నాగేశ్వరరావు, ట్రెజరర్ బాలయోగి సిఆర్‌పిఎఫ్ అధికారులు రెడ్‌క్రాస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ వెలుగులతో విద్యుత్ ఆదా..!

**-కౌన్సిలర్ ఫణితి సైదులు కొత్త ఆలోచన**
**-విద్యుత్ భారం తగ్గించే దిశగా అడుగులు**







**ప్రజాపక్షం/వైరా:** సౌర విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపద్యంలో ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పెద్ద కోరుకొండ సమీపంలో వైరా మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. సంప్రదాయ విద్యుత్ వనరులకు ప్రత్యామ్నాయంగా సౌర విద్యుత్ ప్రోత్సహిచడంతో పాటు ఈ రంగం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రాజెక్ట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. సూర్యరశ్మిని విద్యుత్‌గా మార్చుకునే సోలార్ వ్యవస్థలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఫణితి సైదులు పేర్కొన్నారు. విద్యుత్ అవసరాలు రోజురోజుకు పెరుగుతున్న పరిస్థితుల్లో సౌర విద్యుత్ వినియోగం కుటుంబాలకు దీర్ఘకాలికంగా విద్యుత్ ఖర్చును తగ్గించడంలో ఉపయోగపడుతుందని యువతకు ఉపాధి బాట సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు నిర్వహణ, సాంకేతిక సేవలు, ప్యానెళ్ల అమరిక వంటి విభాగాల్లో స్థానిక యువతకు వివిధ రకాల ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. పెద్దకోరుకొండ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి తగ్గుతుందని, సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. 25 ఏళ్ల వరకు విద్యుత్ ఆదా చేసే అవకాశం సోలార్ వ్యవస్థపై ఒకసారి పెట్టుబడి పెట్టడం ద్వారా దీర్ఘ కాలం విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంటుంది. సాధారణంగా నాణ్యమైన సోలార్ ప్యానెళ్లకు దీర్ఘకాలిక సామర్థ్యం ఉండటంతో, విద్యుత్ వినియోగదారులకు భవిష్యత్ విద్యుత్ ఖర్చులపై కొంత భరోసా కల్పించే అవకావం ఉంటుంది.

### సోలార్‌పై పెట్టుబడి.. విద్యుత్ ఆదాకు దారి..

పెరుగుతున్న విద్యుత్ ధరల నేపద్యంలో ప్రతి కుటుంబం సౌర విద్యుత్ వైపు ఆలోచించాలి అనే సందేశంతో ఫణితి సైదులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు సైతం దోహదం సౌర విద్యుత్ పునరుత్పాదక ఇంధన వనరు కావడంతో సంప్రదాయ ఇందన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడంలో ఉపయోగపడుతుంది. కాలుష్యాన్ని తగ్గించడం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడం వంటి అంశాల్లో సౌర విద్యుత్ ప్రాధాన్యత ఉంది.

### ప్రజలకు ఆదర్శంగా ఫణితి సైదులు చొరవ..

కౌన్సిలర్‌గా ప్రజా సమస్యలపై పనిచేస్తూనే సౌర విద్యుత్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించడం ద్వారా ఫణితి సైదులు ప్రత్యేక చొరవ చూపుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యుత్ ఆదాతో పాటు యువతకు ఉపాధి, పర్యావరణ పరిరక్షణ అనే మూడు అంశాలను కలిపి ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంగా ఈ ప్రాజెక్టును చూడవచ్చని అంటున్నారు. సూర్యుడి శక్తిని విద్యుత్ మార్చుకొని ...ఖర్చును తగ్గించుకోవడంతో పాటు ఉపాధి అవకాశాలను సృష్టించాలనే ఆలోచనలతో ఫణితి సైదులు చేపట్టిన ఈ సోలార్ ప్రాజెక్టు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఫణితి సైదులు మాట్లాడుతూ సౌర విద్యుత్ భవిష్యత్తు తరాలకు ఎంతో ఉపయోగకరమైన ప్రత్యామ్నాయ విద్యుత్ వనరు. రోజురోజుకు విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపద్యంలో ప్రతి కుటుంబం, ప్రతి సంస్థ సోలార్ విద్యుత్ వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ రోజు సోలార్‌పై పెట్టే పెట్టుబడి భవిష్యత్తులో విద్యుత్ ఖర్చును గణనీయంగా తగ్గించుకునేందుకు ఉపయోగపడుతుంది. సోలార్ ప్రాజెక్టుల ద్వారా కేవలం విద్యుత్ ఉత్పత్తి మాత్రమే కాకుండా స్తానిక యువతకు అనేక రకాల ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రాజెక్టుల ఏర్పాటు, నిర్వహణ, సాంకేతిక సేవలు వంటి రంగాల్లో యువతకు నైపుణ్యంతో కూడిన ఉపాధి కల్పించవచ్చు. పెద్దకోరుకొండ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా వందలాది మందికి ఉపాధి లభించడం సంతోషంగా ఉంది. సోలార్ రంగంలో మరిన్ని అవకాశాలు సృష్టించి స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు నా వంతు కృషి చేస్తాను, త్వరలోనే ఈ ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రారంభిస్తారు అని ఫణితి సైదులు తెలిపారు.

# రాంగ్ రూట్‌లో డ్రైవింగ్.. ప్రాణాలకు రిస్క్!

**-దూరం కొంచెం ఎక్కువైనా సరే...సరైన మార్గలోనే ప్రయాణించండి**
**-వాహనదారులకు వైరా ఏసిపి సారంగపాణి సూచన**



**ప్రజాపక్షం/వైరా:** రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, కేవలం కొంత దూరం తగ్గుతుందనే ఉద్దేశ్యంతో ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని వైరా ఏసిపి సాదుల సారంగపాణి సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా సక్రమమైన మార్గంలోనే ప్రయాణించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ ప్రయాణ దూరం కొంత ఎక్కువైనా పర్వాలేదని, రాంగ్ రూట్‌లో వెళ్లడం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోను చేయవద్దని సూచించారు. ఎదురుగా వచ్చే వాహనాలను పట్టించకోకుండా రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వలన క్షణాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొనడం ద్వారా ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

### ప్రయాణీకులు బాధ్యత వహిచాలి...

కారు, ఆటో, క్యాబ్ తదితర వాహనాల్లో ప్రయాణించే సమయంలో కొంత దూరం తగ్గుతుందనే కారణంతో డ్రైవర్లు రాంగ్ రూట్‌లో వెళ్లేందుకు ప్రయత్నిస్తే ప్రయాణీకులు కూడా అడ్డుకోవాలని ఏసిపి సూచించారు. రాంగ్ రూట్‌లో వెళ్లేందుకు డ్రైవర్‌ను అనుమతించకుండా సక్రమమైన మార్గంలోనే ప్రయాణించేలా చూడాలని కోరారు. దూరం తగ్గించుకోవడానికి రాంగ్ రూట్‌ను ఎంచుకోవద్దు. కొన్ని నిముషాలు ఆదా చేసుకోవాలనే ప్రయత్నం జీవితాంతం, కోల్పోయే నష్టానికి దారితీయవచ్చు. సక్రమమైన మార్గంలో ప్రయాణిస్తేనే సురక్షితమైన గమ్యాన్ని చేరుకోగలం అని ఏసిపి సారంగపాణి పేర్కొన్నారు. వాహనదారులు, ప్రయాణీకులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.

# కూసుమంచిలో పోషణ మాసం కార్యక్రమం



**ప్రజాపక్షం/కూసుమంచి:** గ్రామ పంచాయితీ పరిధిలో పోషణ మాసం కార్యక్రమాన్ని సర్పంచ్ కొండా కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇద్దరు గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించి పోషకాహార ప్రాధాన్యాన్ని వివరించారు. పోషణ ప్రదర్శనతో పాటు ఆటలు, పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సమతుల్య పౌష్టికాహారం తీసుకోవాలని, అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ సువర్చల, పంచాయితీ కార్యదర్శి రాళ్లబండి నీరజ, హెచ్‌ఎం హేమ్లా, ఉపాధ్యాయులు శ్రీరాములు, విజయలక్ష్మీ, శృతి, అపర్ణ, ఏఎన్‌ఎం సరళాదేవి, ఆశా కార్యకర్త మరియమ్మ, అంగన్వాడీ టీచర్లు పుష్పలత, లక్ష్మీ కాంత, వరలక్ష్మీ , పద్మ, 23కేంద్రాల సిబ్బంది, గ్రామ పెద్దలు, తల్లులు పాల్గొన్నారు.

# డిఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో వైద్య శిబిరం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ (డిఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో ఎస్వరమ్మ, ప్రశాంతి సదన్ మహిళా వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం డిఎల్ఎస్ఏ కార్యదర్శి పి. దేవి మానస పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు అందించారు. నాల్సా సీనియర్ సిటిజన్ పథకం 2016, తల్లిదండ్రులు మరియు వృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం 2007పై న్యాయ సేవా సంస్థ ద్వారా అవగాహన కల్పించారు. వృద్ధులకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయం, వారి హక్కులు, చట్టపరమైన రక్షణ తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డా॥ వేణుమాధవరావు, మెడికల్ ఆఫీసర్ ఎన్. కృష్ణ చైతన్య, కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ షురూ..!



**ప్రజాపక్షం/మధిర:** తెలంగాణ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల జాబితాకి సంబంధించిన సమావేశం మధిర తహశీల్దార్ కార్యాలయంలో జరిగింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల జాబితాకి సంబంధించిన ప్రక్రియ షెడ్యూల్ విడుదల చేశారు. 2027 మార్చిలో మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్, వరంగల్–ఖమ్మం–నల్గొండ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాలకు ఖాళీలు ఏర్పడనున్న నేపద్యంలో కొత్తగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. సెప్టెంబర్ 28, 2026 ఓటర్ల జాబితా ప్రక్రియపై ప్రజా నోటీసు, అక్టోంబర్ 15 పత్రికల్లో తొలి పునః ప్రచురణ, అక్టోబర్ 25 రెండో పునః ప్రచురణ, నవంబర్ 6 ఫారం 18 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీగా, నవంబర్ 20 ముసాయిదా ఓటర్ల జాబితా ముద్రణ పూర్తి చేసి, నవంబర్ 25 ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ, డిసెంబర్ 25 క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం పూర్తి. డిసెంబర్ 30 తుది ఓటర్ల జాబితా ప్రచురణ, ప్రస్తుత ఓటర్ల జాబితాలో పేరు ఉన్నవారు కూడా కొత్తగా మార్చిన ఫారం 18లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుతో పాటు అవసరమైన దృవపత్రాలు, సర్టిఫికెట్ల ధృవీకరించిన కాపీలను సమర్పించాలని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు స్పష్టం చేయడం జరిగిందని, ఇట్టి సమావేశానికి ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ కరుణాకర్, తహశీల్దార్ రాంబాబు, కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

# క్లినికల్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇంటర్మీడియట్ ఎంఎల్‌టి ఒకేషనల్ కోర్సులో మార్చి 2024 నుంచి ఉత్తీర్ణులైన విద్యార్థులకు క్లినికల్ శిక్షణ ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అందించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు ఎంపికైన వారు రూ.1,000 డిడి రూపంలో చెల్లించాలని గతంలో దరఖాస్తు చేసుకుని ఎంపిక కాని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ బయోడేటా ఫారంతో పాటు పది రూపాయల పోస్టల్ స్టాంప్ అంటించిన సొంత చిరునామా కవర్, సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను జతపరిచి కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో అక్టోబర్ 15 లోగా అందజేయాలని రవిబాబు తెలిపారు.

# అక్టోబర్2న
# మద్యం, మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/మధిర:** మహాత్మాగాంధి జయంతి సందర్భంగా అక్టోబర్2న మధిర మున్సిపాలిటీ పరిధిలో అన్ని రకాల మద్యం, మాంసం విక్రయాలు పూర్తిగా నిషేధించబడినవి అని మధిర మున్సిపల్ కమీషనర్ కొంపల్లి శామ్యూల్, బి.ఐ.పాల్ తెలియజేశారు. మద్యం దుకాణాలు, బార్లు, మాసం విక్రయ కేంద్రాలు, ఇతర సంబంధిత వ్యాపారులు ఈ నిషేధాన్ని తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం, మాంసం విక్రయాలు జరిపినట్లు గుర్తించిన పక్షంలో ఎలాంటి మినహాయింపు లేకుండా వర్తించే చట్టాలు, నిబంధనల ప్రకారం కఠినచర్యలు తీసుకోబడతాయని అన్నారు. ప్రజలు, వ్యాపారులు ఈ నిషేధానికి పూర్తిగా సహకరించి, అక్టోబర్2న మద్యం, మాంసం విక్రయాలు జరగకుండా చూడాలని మున్సిపల్ కమీషనర్ తెలియజేశారు.

# నేడు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి శాంతియుత ఆందోళన

**ప్రజాపక్షం/మధిర:** అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు, ఇతర సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేస్తూ టియుడబ్ల్యూజె, ఐజెయు ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10గంటలకు మధిర గాంధి విగ్రహం వద్ద శాంతియుత ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టియుడబ్ల్యూజె(ఐజెయు) నాయకులు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమ పథకాల అమలులో వివక్షను తొలగించి అర్హులైన ప్రతిఒక్కరికి న్యాయం చేయాలని కోరుతూ నియోజకవర్గ కేంద్రమైన మధిర పట్టణంలోని గాంధి విగ్రహం వద్ద ఉదయం 10గంటలకు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు టియుడబ్ల్యూజె ఐజెయు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టియుడబ్ల్యూజె పిలుపునిచ్చింది.

# స్వచ్ఛతను ప్రజల జీవన శైలిలో భాగంగా చేసుకోవాలి



- అదనపు కలెక్టర్ విద్యాచందన

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** స్వచ్ఛతను ప్రజలు జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని అదనపు కలెక్టర్ డిఆర్‌డిఏ పిడి విద్యాచందన అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని రామచంద్ర డిగ్రీ కాలేజీ ఒక గంటపాటు శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్తను మూలంలోనే వేరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 580 మంది పాల్గొని నాలుగు రకాల చెత్తను వేరు చేశారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలు రామచంద్ర డిగ్రీ కాలేజీ విద్యార్థులు, ట్రైబల్ వెల్ఫేర్ పాల్వంచ బాలికలు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ఎన్‌సిసి ఎన్ఎస్ఎస్ క్రీడాకారులు కోచ్‌లు స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొంచుకున్నారు. జెడ్పి సిఇఓ నాగలక్ష్మీ, డిపిఓ అనూష డివై ఎస్ఓ పరంధామరెడ్డి డిఇఓ శంభుప్రసాద్ సిపిఓరామిరెడ్డి ఎల్‌డిఎం శ్రీనివాస్ రమేష్ సివిల్ సప్లై డిఎం త్రినాథ్‌తో పాటు ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మీ మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- 18వ డివిజన్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కంచర్ల హిమశ్రీ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హిమశ్రీతోపాటు మాజీ ఫ్లోర్‌లీడర్ కంచర్ల జమలయ్య మాట్లాడుతూ ఈ సీజన్‌లో ప్రజలు కాచి చల్లార్చిన నీటినే సేవించాలన్నారు. ఎప్పటికప్పుడు వేడివేడి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను నివారించుకోవచ్చని, వర్షపునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, టైర్లు,పూలకుండీలు, ఇతరాల్లో వర్షపునీరు నిల్వ ఉండటం ద్వారా దోమలు వృద్ధి చెంది రోగాలకు దారితీసే అవకాశం ఉందని, ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు చుట్టుప్రక్కల వారి ఆరోగ్యాలు కూడా బాగుంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో డా.నవజ్యోతి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పాటి మోహన్ రావు, ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు కే పద్మ రాజేశ్వరి టి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



# యూనిఫాం కుట్టులో తేడాలుంటే సహించేది లేదు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి, మండల ప్రత్యేక అధికారి కె.రవిబాబు స్పష్టం చేశారు. ఈ నెల చివరి వారం నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్ దుస్తులను తప్పనిసరిగా అందించాలని అధికారులను ఆదేశించారు. యూనిఫామ్ కుట్టులో తేడాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. గురువారం మండలంలోని నాచేపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నిత్యావసర సరుకులు, కూరగాయల నాణ్యత, నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రగతిని తెలుసుకున్నారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులపై ఆరా తీశారు. పాఠశాలకు టాయిలెట్లు, ప్రహరీగోడ, డైనింగ్ హాలు అవసరమని అధికారులు డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఐకేపీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాలలకు చేరాల్సిన యూనిఫామ్ దుస్తుల పంపిణీలో జరుగుతున్న జాప్యంపై రవిబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులోగా ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్‌లు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. యూనిఫామ్ కుట్టులో కూడా తేడాలకు తావివ్వకూడదని హెచ్చరించారు. పలు ప్రాంతాల్లో యూనిఫామ్ కుట్టు నాణ్యతపై విమర్శలు వస్తున్నాయని పేర్కొంటూ, అలాంటి సమస్యలు పునరావృతం కాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందించే దుస్తుల విషయంలో నాణ్యత, కొలతలు, కుట్టు తదితర అంశాలను పరిశీలించిన తర్వాతే పంపిణీ చేయాలని సూచించారు. యూనిఫామ్ విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, విద్యార్థులకు నాణ్యమైన దుస్తులు సకాలంలో అందించాల్సిందేనని రవిబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యం.యర్రయ్య, ఐకేపీ ఏపీఎం కట్టా సురేందర్‌బాబు,సిసిలు పెరుగు మల్లయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా వృద్ధుల దినోత్సవం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని పైనంపల్లి లో టీడీజేపీసీ, శ్రీ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. వయోవృద్ధుల పట్ల కుటుంబంలో, సమాజంలో గౌరవ భావంపెరగాలని సూచించారు. ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పీ.వీ.చలమయ్య, సర్పంచ్ నరేష్, ఉప సర్పంచ్ అమనబోయిన ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బీజేపీ ఆధ్వర్యంలో వయో వృద్ధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, కందర బోయిన వెంకటరమణ, సూరేపల్లి, జ్ఞాన రత్నం, ఏపూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పట్టా భూములను అసైన్డ్ ల్యాండ్‌గా చూపించొద్దు

**సర్వే నెంబర్ 1183లో 60 ఎకరాల భూములపై సర్పంచ్ అశ్విని కలెక్టర్‌కు వినతి**

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 1183లో ఉన్న పట్టా భూములను అసైన్డ్ ల్యాండ్‌గా చూపించారని, వాటిని వెంటనే తొలగించి రైతులకు న్యాయం చేయాలని గ్రామ సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ దివాకరను కలిసి జవ్వాజి అశ్విని వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబర్ 1183లో సుమారు 60 ఎకరాల భూమిని అసైన్డు ల్యాండ్‌గా చూపిస్తున్నారని, వాస్తవానికి ఆయా భూములు పట్టా భూములని సర్పంచ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.



ఎప్పటి నుంచో పలువురు రైతులు ఈ భూములను పట్టా హక్కులతో సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అసైన్డు ల్యాండ్‌గా నమోదవడంతో రైతులు తమ భూములకు సంబంధించిన హక్కులు, రిజిస్ట్రేషన్ తదితర అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని కోరారు. ప్రత్యేకంగా సుమారు 60 ఎకరాల భూములను అసైన్డు ల్యాండ్ జాబితా నుంచి తొలగించి రిజిస్టర్ భూములుగా గుర్తించి రైతులకు న్యాయం చేయాలని అశ్విని నాగరాజు కలెక్టర్‌ను కోరారు. సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# డిజిపిని కలిసిన జిల్లా టెన్నిస్ సభ్యులు



**ప్రజాపక్షం/పాల్వంచ :** హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో డిజిపి సివి ఆనంద్‌ను గురు వారం జిల్లా టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. అనం తరం ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్న మెంట్ 2026 జ్ఞాపికను అందజేశారు. అనం తరం వారు మాట్లాడుతూ జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలలో శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ టోర్న మెంట్ 2026 క్రీడలు విజయవంతంగా ముగిశాయనిదీనితో డిజిపిని కలిశామని స్పష్టం చేశారు.

# గురువయ్య మృతి పార్టీకి తీరని లోటు



**ప్రజాపక్షం/పాల్వంచ :** కాలం గురువయ్య మృతి పార్టీకి తీరని లోటని సిపిఐ జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు అన్నారు. మండల పరిధి లక్ష్మిదేవిపల్లి (యు ) గ్రామశాఖ సభ్యులు గురువయ్య కర్మలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా గురువయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ గురువయ్య పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, రైతు సంఘం మండల నాయకులు నిట్ట అమృతరావు, యువజన సంఘం మండల నాయకులు వజ్జా వాసు, ప్రజానాట్యమండలి జిల్లా కమిటి సభ్యులు తాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మేరమ్మ దేవాలయంకు రూ.3 లక్షలు విరాళం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని మంగాపురంతండా లో నూతనంగా నిర్మించనున్న సేవాలాల్, మేరమ్మ యాడి దేవాలయం కు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.3 లక్షల విరాళం ను అందించారు. గురువారం తన క్యాంపు కార్యాలయం లో స్థానిక సర్పంచ్ ధీరావత్ అశోకరాణి, చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి లకు చెక్కు అందించారు. ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఏజెన్సీ గ్రామాల్లో ఇంటింటికీ పోస్టల్ సేవలు



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలకు ఇంటింటికీ పోస్టల్ సేవలు అందేలా సిబ్బంది పని చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా పోస్టల సూపరింటెండెంట్ వీరభద్రస్వామి సూచించారు. దుమ్ముగూడెం సబ్ పోస్టాఫీసులో గురువారం నిర్వహించిన ఇంటింటికీ పోస్టల్ ఖాతా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామసభలు నిర్వహించి పోస్టల్ శాఖ సేవలు, గ్రామీణ పోస్టల్ జీవిత బీమాపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి వ్యక్తికి బీమా సౌకర్యం కల్పించడంతో పాటు గ్యాంగ్ ఇన్సూరెన్స్‌లో రూ 10లక్షల ప్రయోజనం గురించి వివరించాలని తెలిపారు. పోస్టల్ సిబ్బంది ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎస్‌పిఎం రవి కుమార్, ఎంటలు సుధీర్, రవి, బీపీఎంలు, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

# సేవా స్ఫూర్తితో అర్జున్ దేవ్ పుట్టినరోజు వేడుకలు



**ప్రజాపక్షం/వైరా:** మిట్టపల్లి అర్జున్‌దేవ్ ప్రథమ పుట్టినరోజు వేడుకలు కుటుంబ సభ్యులు సేవా స్ఫూర్తితో ఘనంగా నిర్వహించారు. మిట్టపల్లి నాగేశ్వరరావు, అరుణ దంపతుల మనవడు, మిట్టపల్లి మణికంఠ, మీనాక్షి దంపతుల కుమారుడైన అర్జున్‌దేవ్ పుట్టినరోజు సందర్భంగా గుట్టబడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, డ్రాయింగ్ సామాగ్రి, పెన్సిళ్లను పంపిణీ చేశారు. అదేవిధంగా పాఠశాలలో పని చేస్తున్న ఆయమ్మలకు చీరలను అందజేశారు. చిన్నారి పుట్టినరోజు వేడుకలను కేవలం కుటుంబ సభ్యుల మధ్య కాకుండా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమంగా నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి డైమండ్ క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య మహాసభ పెద్దలు, పాఠశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వరి పంటలకు మొగిపురుగు, కంకినపల్లి బెడద



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని భగవీడులో మొగిపురుడు, కంకినపల్లి ఆశించిన వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి సందర్శించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మొగిపురుగు వ్యాప్తికి అనుకూలంగా ఉన్నందున రైతులు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. మొగిపురుగు ఆశించినప్పుడు చిన్న మొక్కల్లో మధ్య కాడ ఎండిపోవడం, పిలకల దశలో తెల్ల కంకులు ఏర్పడటం, కాండంలో రంధ్రాలు కనిపిస్తాయని తెలిపారు. కలుపు, పంట అవశేషాలు తొలగించి అధిక నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఉధృతి ఎక్కువైతే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50శాతం ఎస్‌పీ 400 గ్రామ, కొరాజెన్ 18.5శాతం ఎస్‌సీ 60 మిలీ, కార్బోసల్ఫాన్ 25శాతం ఈసీ 400 మిలీ, లేదా ఫిప్రోనిల్ 5శాతం ఎస్‌సీ 400 గ్రాములను ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయవచ్చని తెలిపారు. నివారణకు స్ట్రెప్టోమైసిన్ 22.9శాతం ఎస్‌సీ లీటరు నీటికి 1 గ్రాము చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వేదవ్యాస్, రైతులు పాల్గొన్నారు.

# చందా నాయక్ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు



ప్రజాపక్షం/కారేపల్లి: భాగ్యనగర్‌తండాకు చెందిన సీపీఐ నాయకుడు గుగులోత్ చందా నాయక్ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. భాగ్యనగర్‌తండాలో నిర్వహించిన సంస్మరణ సభలో వారు పాల్గొని చందా నాయక్‌కు నివాళులర్పించారు. చందా నాయక్ నిబద్ధత, క్రమశిక్షణతో పార్టీ బలోపేతానికి కృషి చేశారని, గ్రామ శాఖలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన స్ఫూర్తితో పీడిత ప్రజల సమస్యలపై పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి లతాదేవి, పోటు కళావతి, తాటి నిర్మల, చిన్నంశెట్టి భూషయ్య, పుచ్చకాయల శ్రీనివాస్, దళ్‌సింగ్, రాయల రామారావు, అమీర్ జానీ, భాగ్యనగర్ తండా శాఖ కార్యదర్శి బాపుసింగ్, కౌలియా హరిసింగ్, రవి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎఫ్‌ఎల్‌ఎన్ అమలులో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

**-జిల్లా విద్యాశాఖాధికారిణి వాసంతి**




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అమలులో ఖమ్మంజిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యా శాఖాధికారిణి డి. వాసంతి తెలిపారు. గురువారం ఖమ్మంలోని సైన్స్ మ్యూజియం జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పెసర ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన సెప్టెంబర్ నెలకు సంబంధించిన ఎఫ్‌ఎల్‌ఎన్ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిఈవో వాసంతి మాట్లాడుతూ పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పిజిఐ), యుడైస్ (యుడిఐఎస్‌ఈ) వివరాల నమోదులో ఖచ్చితత్వం పాటించాలన్నారు. రాబోయే వార్షిక పరీక్షల్లో జిల్లా ర్యాంకును మెరుగుపరిచేందుకు రెండు, ఐదు, ఎనిమిది తరగతుల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సగటు హాజరు శాతాన్ని పెంచేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తరచూ పాఠశాలలను సందర్శించాలన్నారు. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గత సెప్టెంబర్ మాసంలో సగటున ప్రతి మూడు మండలాలకు ఒక బృందం చొప్పున తొమ్మిది బృందాలు జిల్లా వ్యాప్తంగా 230 పాఠశాలలను సందర్శించి నివేదికలు రూపొందించినట్లు తెలిపారు. సందర్శన సమయంలో నిర్వహించిన స్పాట్ అసెస్మెంట్ పరీక్షల్లో జిల్లా సగటు, వివిధ మండలాల ప్రస్తుత విద్యా ప్రమాణాల స్థాయిలను సమావేశంలో వివరించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తమ పరిధిలోని పాఠశాలల్లో బోధన, అభ్యాసన ప్రక్రియలు, విద్యార్థుల ప్రగతిపై పరిశీలన వివరాలను వివరించి పలు సూచనలు చేశారు. జిల్లా ఎఫ్‌ఎల్‌ఎన్ సెల్ సభ్యులు శ్యాంలాల్, ప్రవీణ్ కుమార్, శ్రావణ్‌కుమార్, సేన్యా తదితరులు సబ్జెక్టుల వారీగా విద్యా ప్రమాణాలు పెంపునకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను ప్రదర్శించారు. విద్యార్థుల యూనిఫాం, పాఠ్యపుస్తకాల పంపిణీ, మొక్కల పెంపకం, ఎయాక్స్‌ఎల్ ల్యాబ్స్ పనితీరు తదితర అంశాలపై ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, సిఎంవో ప్రవీణ్‌కుమార్, ఎఫ్ఏవో ఎస్. శ్యామ్‌సన్, డిఎస్‌వో శ్రీనివాసులు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సభ్యులు పాల్గొన్నారు.

# మండల పరిషత్ సమావేశానికి సర్పంచులు డుమ్మా!

**-22 మందికి 9 మంది మాత్రమే హాజరు**
**-అధికారుల హాజరు పైనా విమర్శలు**
**-సమస్యలు వివరించాల్సిన చోట క్రిందిస్థాయి సిబ్బందితో సరిపెట్టుకుంటున్నారనే ఆరోపణలు**



ప్రజాపక్షం/వైరా: వైరా మండల పరిషత్ సమావేశం గురువారం నిర్వహించారు. మండలంలోని 22 మంది సర్పంచ్‌లకు సమావేశానికి హాజరు కావాల్సి ఉండగా కేవలం 9 మంది మాత్రమే హాజరయ్యారు. తాటిపూడి, కొష్టాల, లక్ష్మీపురం, ముసలిమడుగు, గొల్లపూడి, పాలడుగు, కొండకూడెం, నారపునేనిపల్లి, వల్లాపురం గ్రామాల సర్పంచ్‌లు సమావేశానికి హాజరై తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా...మండల పరిషత్ సమావేశానికి పలువురు అధికారులు కూడా పూర్తిస్థాయిలో హాజరు కాలేదని తెలుస్తుంది. సంబంధిత శాఖలకు సంబంధించిన సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న అధికారులను పంపకుండా, కొన్ని ప్రభుత్వ కార్యాలయాల నుంచి కిందిస్థాయి సిబ్బందిని నామమాత్రంగా సమావేశానికి పంపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచ్‌లు సమావేశంలో ప్రస్తావించిన సమయంలో వాటిపై సమగ్రంగా వివరించాల్సిన అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తుంది. కొందరు కిందిస్థాయి సిబ్బందికి శాఖాపరమైన పూర్తి సమాచారం లేకపోవడంతో సర్పంచ్‌లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సతమతమవుతున్న పరిస్థితి నెలకొంటుందని పలువురు పేర్కొంటున్నారు. కొన్ని శాఖల నుంచి అటెండర్లు సైతం సమావేశాలకు హాజరవుతున్న పరిస్థితి ఉందనే చర్చ జరుగుతుంది. దీంతో మండల పరిషత్ సమావేశం నిర్వహిస్తున్న అసలు ఉద్దేశం ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రజాప్రతినిధులు తమ గ్రామాల సమస్యలను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందేందుకు సమావేశాలు వేదికగా ఉండాల్సి ఉండగా, కీలక అధికారులు గైర్హాజరు కావడం వలన సమస్యల పరిష్కారంపై ప్రభావం పడుతుందని సర్పంచ్‌లు అభిప్రాయపడుతున్నారు. గురువారం జరిగిన సమావేశంలో హాజరైన సర్పంచ్‌లు తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, గ్రామీణాభివృద్ధి తదితర అంశాలకు సంబంధించిన పలు సమస్యలను పరిశీలించిన అధికారులు సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఇకనైనా మండల పరిషత్ సమావేశాలకు 22 మంది సర్పంచ్‌లు హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతి శాఖకు సంబంధించిన పూర్తిస్థాయి అధికారులను సమావేశానికి పంపించాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

# తల్లాడ పోలీస్ స్టేషన్‌లో వీడ్కోలు వేడుకలు



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ పోలీస్ స్టేషన్‌లో నాలుగేళ్ల పాటు విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖకు విశేష సేవలందించిన ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ బదిలీ నేపథ్యంలో వీడ్కోలు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఐలు వెంకటకృష్ణ, వెంకటేష్‌ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారిని శాలువలతో ఘనంగా సన్మానించారు. తల్లాడ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహించిన సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలకు అందుబాటులో ఉండటం, పోలీస్ శాఖకు సంబంధించిన విధులను సమర్థవంతంగా నిర్వహించడంలో వారు అందించిన సేవలను ఈ సందర్భంగా సిబ్బంది గుర్తు చేసుకున్నారు. బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న ఏఎస్ఐ చెన్నారావు, పిచ్చయ్య, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లను తల్లాడ పోలీస్ స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి వీడ్కోలు పలికారు. విధి నిర్వహణలో వారి సహకారం, సహచరులతో కలిసి మెలిసి పనిచేసిన తీరును సిబ్బంది ప్రశంసించారు. బదిలీపై వెళ్తున్న పోలీస్ సిబ్బంది నూతన విధుల్లోనూ విజయవంతంగా రాణించాలని పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆకాంక్షించారు.

# ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రం

**-ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనాథ్‌రెడ్డి, రమేష్**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పట్టభద్రులంతా దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, చింతల రమేష్ తెలిపారు. ఖమ్మం నగరం ఎన్నెస్పీ రోడ్డులోని సరితా క్లినిక్ సెంటర్‌లో ఉదయ్ నెట్ సెంటర్‌లో, ప్రకాష్ నగర్‌లోని కమిషనరేట్ ఎదురుగా తాజ్ నెట్ సెంటర్లలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటరు నమోదు కేంద్రాలు గురువారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరితా క్లినిక్ సెంటర్‌లో ఉదయ్ నెట్ సెంటర్ వాట్సాప్ నెంబర్, ప్రకాష్ నగర్‌లోని తాజ్ నెట్ సెంటర్ వాట్సాప్ నెంబర్లకు ఓటు నమోదుకు కావాల్సిన సర్టిఫికెట్లను పంపిస్తే ఓటు నమోదు చేస్తారని తెలిపారు. ఈ సెంటర్‌కు సహకారంగా ఏఐవైఎఫ్ ఖమ్మం నగర అధ్యక్ష, కార్యదర్శులు దుర్గానాథ్, కృష్ణప్రసాద్‌లను సంప్రదించాలని కోరారు. పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రవణ్, నగర అధ్యక్ష, కార్యదర్శులు దుర్గానాథ్, కృష్ణప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు బొప్పి ఉమా, జిల్లా నాయకులు అశోక్, హేమంత్, ఉదయ్, నవీన్, నరేష్, సాయి పాల్గొన్నారు.

# సామూహిక సీమంతాలు, అన్నప్రాసన



ప్రజాపక్షం/ ఖమ్మం : పోషణ మాస వారోత్సవాల్లో భాగంగా సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఖమ్మం నగరంలోని ఖమ్మం అర్బన్ ప్రాజెక్టు ద్వారకానగర్ బుర్హాన్‌పురం సెక్టార్‌లో సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది గర్భిణీ స్త్రీలకు సీమంతాలు నిర్వహించారు.చిన్నారులకు అన్నప్రాసన చేశారు. సిడిపివో భద్రమ్మ, మాజీ కార్పొరేటర్ రాపర్తి శరత్, శీలంశెట్టి వీరభద్రం అతిథులుగా హాజరయ్యారు. ప్రత్యేకంగా ఫుడ్ స్టాల్ను ఏర్పాటు చేసి గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. సీమంతాల సందర్భంగా చీరె సారె, గాజులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబర్ తొమ్మిది నుంచి అక్టోబర్ ఎనిమిది వరకు ఖమ్మంలో పోషణ మాస వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరైన సమయంలో తీసుకోవాల్సిన టీకాలు, మందులు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

# బాబుని సన్మానించిన రేషన్ డీలర్లు



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడలో రేషన్ డీలర్ల జిల్లా ఉపాధ్యక్షులు టి. బాబు, సహాయ కార్యదర్శి మణికంఠ లను ఖమ్మంజిల్లా రేషన్ డీలర్ల కమిటీ వారి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఖమ్మంజిల్లా రేషన్ డీలర్ల అధ్యక్షులు, కార్యవర్గం పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# పొట్రు ప్రకాశంకు నివాళులర్పించిన మువ్వా



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో పొట్రు ప్రకాశం ఇటీవల మృతిచెందారు. మువ్వా విజయబాబు గురువారం వారి స్వగృహానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. పొట్రు ప్రకాశం ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బేతుపల్లి గ్రామ సర్పంచ్ రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, మువ్వా అభిమానులు పాల్గొన్నారు.

# తల్లాడలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/ తల్లాడ : ఖమ్మంజిల్లాలో ప్రధాన నగరాలకు కూడలిగా ఉన్న తల్లాడ పట్టణంలో సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఏర్పాటుకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయికి గురువారం వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో ప్రధాన నగరాలకు కూడలిగా ఉన్న తల్లాడలో సెంట్రల్ లైటింగ్, డివైడర్ లేకపోవడంతో ఈ ప్రాంత వాసులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించిన ఎంఎల్ఏ వెంటనే ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా వివరాలు అందించి సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనితో కాంగ్రెస్ నాయకులు ఎంఎల్ఏకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా కమిటీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.